క్లుప్తంగా

ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపొద్దు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం మీదుగా వనపర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపొద్దని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ రూట్‌లో పల్లెలు, తండాలే ఎక్కువగా ఉన్నాయని, అక్కడ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. వాటిలో స్టూడెంట్ పాసులు పనిచేయకపోవడంతో సాయంత్రం పాఠశాలలు వదిలే సమయంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని దొంతికుంటతండా మోడల్ స్కూల్, మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు వదిలే సమయానికి ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతుండడంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సులను రద్దు చేసి ఆ స్థానంలో పల్లె వెలుగును పునరుద్ధరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కొనసాగిన ప్రచారం



సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ అభ్యర్థి జి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జరిగే కాంగ్రెస్ విజయభేరి సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు నుచేశారు. రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. మధుసూదన్‌రెడ్డి సభ ఏర్పాట్లను పరిశీలించారు.

‘బతుకుదెరువుకు బాటలు వేశా’

వనపర్తి: వలసలకు నిలయమైన పాలమూరుకు సాగునీరు తీసుకొచ్చి బతుకు దెరువుకు బాటలు వేశానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. శనివారం పెద్దమందడి మండలం జగత్‌పల్లి, మణిగిళ్ల, మోజర్ల, అమ్మపల్లి, అల్వాల, చిన్నమందడి, దొడగుంటపల్లి, అంకాయపల్లితండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి మాట్లాడారు. కాల్వలు తవ్వించడంతో తుమ్మలు దర్శనమిచ్చే ప్రాంతంలో నేడు పచ్చని వరిపంటలు దర్శనమిస్తున్నాయన్నారు. రేపటి భవిష్యత్ తరాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాధరిత పరిశ్రమలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. పుష్కలంగా సాగునీటి వనరులను సమకూర్చుకోవటంతో రాష్ట్రంలో 2.5 కోట్ల మందికి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి లభించిందని తెలిపారు.

సంక్షేమ ఫలాలు అందని ఇళ్లులేదు

సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకం అందని ఇళ్లు రాష్ట్రంలో లేవన్నారు. కాంగ్రెస్ పాలనతో ఉన్న కరెంట్ కష్టాలను తొలి నాళ్లలోనే దూరం చేసి నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేశామన్నారు. దీంతో రైతులను, పరిశ్రమలను కాపాడుకోగలిగామన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు.

రేషన్ కార్డుతో కేసీఆర్ బీమా

రైతుబీమా తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా తెల్లరేషన్ కార్డు ఉన్న పేద కుటుంబాలకు కేసీఆర్ బీమాను వర్తింపజేసేందుకు సీఎం మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు.



మద్దిగట్లలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి నిరంజన్‌రెడ్డి

రైతుబంధుకు ఈసీ అనుమతించింది

ఎన్నికల సమయంలో రైతుబంధు పథకం పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ చేస్తే ఓటర్లపై ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమీషన్‌కు లేఖలు రాసి ఇబ్బందులకు గురిచేయాలని చూశారన్నారు. కానీ ఈసీ పాత పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని తేల్చిచెప్పటం రైతులకు శుభపరిణామం అన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరొక్క సారి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి నిరంజన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్‌గౌడ్, పరశురాం, శన్ముఖి, వెంకటేష్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం గెలిపించండి

గోపాల్‌పేట: వనపర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థి నిరంజన్‌రెడ్డికి ఓటు వేసి గెలించాలని ఆయన సతీమణి సింగిరెడ్డి వాసంతి కోరారు. శనివారం ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవల్లి మండలంలోని కేశంపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.లక్షలు ఖర్చు చేసి బీటీ రోడ్లు, సబ్‌సెంటర్ నిర్మాణం, జీపీ భవనం, బస్‌షెల్టర్, సీసీరోడ్లు పనులు, మిషన్ భగీరథ పథకం అమలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సేనాపతి, సురేందర్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కేశంపేటలో..



రంగాపురంలో..



పామిరెడ్డిపల్లిలో..

అవకాశమిస్తే సమస్యలు పరిష్కరిస్తాం



వాకిటి శ్రీహరి సమక్షంలో పార్టీలో చేరిన సింగంపేట నాయకులు

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని ఆదరించి ఎన్నికల్లో ఓటేసి గెలిపిస్తే ప్రధాన సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి చేయూతనిస్తామని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని నందిమళ్లలో శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈమేరకు గ్రామానికి చెందిన సీపీఎం, ప్రజాపంథా నాయకులు తమ గ్రామానికి బీటీ రహదారి వ్యవస్థ లేక ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి నిర్మాణ పనులను గత కృష్ణ పుష్కరాల సమయంలో పూర్తి చేస్తామని పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తమ గ్రామం వరకు ఉన్న బీటీ రహదారిని పనులను నేటికీ పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు కేశం నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయూబ్‌ఖాన్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలేష్, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అరవింద్, బాలరాజ్, మునప్ప, సుధాకర్, చిన్న కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు..

మండలంలోని సింగంపేటలో బీఆర్‌ఎస్‌కు చెందిన అమరచింత లిఫ్ట్ కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం నాయకులు మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నారాయణ, రాజు, దశరథ్, పాంరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రాములు, చిన్న ఆంజనేయులు, ప్రసాద్‌తో పాటు 20 మంది బీఆర్‌ఎస్‌కు రాజీనామ చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



నందిమళ్లలో మాట్లాడుతున్న కేశం నాగరాజ్‌గౌడ్

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆదివారం కర్ణాటక సీఎం సిద్దరామయ్య నిర్వహించే మక్తల్ రోడ్ షో లో అందరూ పాల్గొనాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీకేసీఆర్ చైర్మన్ బాలక్రిష్టారెడ్డి అన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో మాదాసి కుర్వలు, కుర్వలు, యాదవులతో పాటు కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి టీపీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. మాజీ ఎంపీపీలు హన్మంతు, శ్రీహరి, చంద్రకాంత్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, రాములు ఉన్నారు.

నర్వ: ఆరు గ్యారెంటీ పథకాలతో విజయం ఖాయమని మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని యాంకి, బెక్కర్‌పల్లి, లంకాల్, పెద్దకడ్మూర్, జక్కన్నపల్లి, కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, బంగ్లాలక్ష్మీకాంత్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, బల్‌రాంగౌడ్, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు శరణప్ప, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

భూత్పూర్/చిన్నచింతకుంట/కొత్తకోట/కొత్తకోట రూరల్: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం భూత్పూర్ పట్టణంతో పాటు అమిస్తాపూర్, సిద్దాయిపల్లి గ్రామాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి ఉద్యమం చేశారని అన్నారు. దేశంలోని ఏ సీఎం చేయనన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణాలో అమలు అవుతున్నాయని అన్నారు. భూత్పూర్, అమిస్తాపూర్‌తో కలిపి మున్సిపాలిటీ ఏర్పాటు చేశామని.. మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. అమిస్తాపూర్ , సిద్దాయిపల్లి రహదారిని బీటీ రోడ్డుగా మార్చడంతో పాటు సిద్దాయిపల్లి వద్ద 288 మందికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి బీదలకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు ఎదోరకంగా అందుతున్నాయని.. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మురళీధర్ గౌడ్, మండడి సరోజ్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు

చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట, గోప్యానాయక్ తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం అన్నసాగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆల వెంకటేశ్వరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బోయ వెంకటేష్, హరిజన్ వెంకటేష్, ఆనంద్‌గౌడ్, చాకలి నర్సింహులు, వావలి అంజన్న, డ్రైవర్ రాములు తదితరులు ఉన్నారు.

కొత్తకోట పట్టణ కేంద్రంలో పలువరు కౌన్సిలర్ నాగన్నసాగర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే శనివారం రాత్రి ఆమడబాకుల, సత్యహళ్లి, బూత్‌కూర్, అప్పరాల, పామాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆకుల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



అమిస్తాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మతోన్మాద శక్తులను ఓడిద్దాం

పాన్‌గల్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ జబ్బార్ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతుందని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ కుట్రలు చేస్తుందన్నారు. రైతు, కార్మిక, పేదల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ఆయా వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తుందని వాపోయారు.

న్యాయ సేవలపై అవగాహన

కొల్లాపూర్: న్యాయ సేవలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తులు ఆర్‌వీఎస్‌ఎస్ మిథున్‌తేజ, జ్యోత్స్న గుంటి అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ గురుకుల విద్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను దుర్వినియోగం చేస్తూ.. ఇతరులకు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. హక్కుల ఉల్లంఘన జరిగితే న్యాయస్థానాలను ఆశ్రయించాలన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందు దొందే

ఆత్మకూర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని, మోసపూరిత హామీలతో మరోసారి మోసం చేసేందుకు పూనుకుంటున్నాయని బీజేపీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేచింతల, వీరరాఘవపూర్, కత్తేపల్లి, తూంపల్లి, ఆరేపల్లి, తిప్డంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం అభివృద్ధిని అధోగతి పట్టించారని, చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి లేదని దుయ్యబట్టారు. అమలు చేయలేని హామీలతో కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా చేతులెత్తేసిందని, ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు.

బీజేపీతోనే సుపరిపాలన

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధిచేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని జోస్యం చెప్పారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కమలం గుర్తుకు ఓటువేసి బీజేపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, గోపాల్, శశిధర్‌రెడ్డి, చిన్ననర్సింహ, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, యశ్వంత్, గోపాల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మాగనూర్: నేరడగం మఠాన్ని సందర్శించడంతో పాటూ పంచమ సిద్ధలింగ మహాస్వామి ఆశీర్వాదం పొందడం తన పూర్వజన్మ సుకృతం అని బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర యడ్యూరప్ప అన్నారు. శనివారం సాయంత్రం మాగనూర్ మండలంలోని నేరడగం మఠం పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకునేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, మక్తల్ బీజేపీ అభ్యర్థి జలేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మఠం పీఠాధిపతి అయిన పంచమ సిద్ధలింగ మహాస్వామిని పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం అక్కడికి చేరుకున్న బీజేపీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలుపించాలని కోరారు. బీజేపీ గెలిస్తే మొదట మన సాంప్రదాయాలు, సంస్కృతి, మఠాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం బీజేపీ నాయకులు విజయేంద్ర యడ్యేరప్పను సన్మానించారు. కార్యక్రమంలో గుర్మిట్‌కల్, కల్లూర్, శాపూర్ పీఠాధిపతులతో పాటూ బీజేపీ నాయకులు కొండయ్య, నారాయణ, కర్నెస్వామి, శ్యామలమ్మ, గంగాధర్‌గౌడ్, రమేష్ గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



పంచమ సిద్ధలింగ మహాస్వామిని సన్మానిస్తున్న విజయేంద్ర యడ్యూరప్ప, బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి



కత్తేపల్లిలో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

బీజేపీతోనే సంక్షేమం



- ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి అనుజ్ఞారెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శివశంకర్, రాంరెడ్డి, ఆశన్న, వెంకటరమణ, రాంచందర్, గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.
- పేదల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వారణాసి కల్పన అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం వనపర్తి బీజేపీ అభ్యర్థి అనుజ్ఞారెడ్డి సతీమణి శ్రీమతి స్వాతి, తలిదండ్రులు అరుణమ్మ, వెంగల్‌రెడ్డితో కలిసి మండలంలోని సూగూరు, కొత్తసూగూరు, గుమ్మడం, బునాదిపురం, పాతపల్లి, కంచిరావుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పేదలకు మొండిచేయి

- పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు సంక్షేమ ఫలాలు అందించడంలో విఫలమైందని వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన గోపాల్‌పేట మండలంలోని బుద్దారం, ధర్మ్యతండా, ఆముదాలకుంటతండా, లక్ష్మీతండా, పొలికెపాడు, లక్ష్మీదేవిపల్లి, తల్పునూరు, తల్పునూరుతండా, రేవల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేశారని, డబుల్ బెడ్రూం ఇళ్ల ఊసే లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డికి వనపర్తి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాడని ఆయన సతీమణి తూడి శారద తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో విజయవర్ధన్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వై.శాఖాపూర్ సర్పంచ్ రవికుమార్‌యాదవ్ బీఆర్‌ఎస్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు.



మార్పు కోసం పోరాటం



సాక్షి, నెట్‌వర్క్: మక్తల్ నియోజకవర్గంలో అధికారంలో లేకుండానే సొంత నిధులతో వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి రూ.కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేశారని ఆయన సతీమణి వర్కటం అంజనారెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి తరుపున రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్నాథ్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ అధికారం కట్టబెడితే ఎమ్మెల్యే చిట్టెం అభివృద్ధిని విస్మరించారని, నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇళ్లు కూడా కట్టలేదని ఎద్దేవా చేసారు. కార్యక్రమంలో నాయకులు కళాధర్‌రెడ్డి, అనీల్, స్వరాజ్, నాని, రమేష్, శివ, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్ గెలవాలే

కొల్లాపూర్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విఘ్నంగా కొనసాగాలంటే బీఆర్‌ఎస్ మళ్లీ గెలవాలే అని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి నేనావత్ శివుడు శనివారం కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో 19 ఏళ్లు కొల్లాపూర్‌ను పాలించిన జూపల్లి ఆయన స్వార్థ ప్రయోజనాలు తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. ఆయన హయాంలో ఒక వర్గానికి తప్ప ప్రజలకు ఎటువంటి లబ్ధి చేకూరలేదని ఎద్దేవా చేశారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు.

కొల్లాపూర్‌లో జోరుగా ప్రచారం

కొల్లాపూర్ పట్టణంలోని అన్ని వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు ఇంటింటి ప్రచారం జోరుగా నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్, తాగునీరు, సాగునీటి కష్టాలు ఏర్పడతాయన్నారు.

కోడేరు: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, సర్పంచ్ వెంకటస్వామి, రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు నక్కలపల్లి, వెనచర్ల, ఆదిరాల, పెద్దకార్పాముల, కల్వకోల్, సాతాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని అధికా మెజారిటీతో గెలిపించాలని కోరారు. నక్కలపల్లిలో సర్పంచ్ రాధిక, వార్డు సభ్యులు సుధాకర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, రాములు, రవీందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

పాన్‌గల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి గ్రామంలో అభివృద్ధి జరిగిందని మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధి కొనసాగుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కదిరెపాడు, శాగాపూర్, శాగాపూర్‌తండా, చిక్కేపల్లి, జమ్మాపూర్, బండపల్లి, కొత్తపేట, పాన్‌గల్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వెంకటయ్యనాయుడు, బాలయ్య, సోమ్‌నాథ్‌నాయక్ పాల్గొన్నారు.

చిన్నంబావి: ఈ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి విజయం సాధించి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 300 మంది కార్యకర్తలు ధారాసింగ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో గోవింద్ శ్రీధర్‌రెడ్డి, రాజురెడ్డి, విష్ణు, రామకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు.



చిక్కేపల్లిలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు



ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న వృద్ధురాలు

రాజకీయ ప్రక్షాళనకు ఉద్యమం

వీపనగండ్ల/చిన్నంబావి: యువతరం ప్రతినిధిగా శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శిరీష గెలుపు రాజకీయ ప్రక్షాళన ఉద్యమానికి నాంది కావాలని సీబీఐ మాజీ డైరెక్టర్ జెడీ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం వీపనగండ్ల మండలంలోని బొల్లారం, చిన్నంబావి మండల కేంద్రంలో కొల్లాపూర్ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన శిరీష అలియాస్ బర్రెలక్క తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు, మద్యంతో రాజకీయ విలువలు పూర్తిగా నాశనం అవుతున్న తరుణంలో ఎంతో ధైర్యంతో నామినేషన్ వేసి యువతరానికి శిరీష ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు పోలింగ్ బూతులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి ఆమెకు తగు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు.

పాన్‌గల్: మండలంలోని బుసిరెడ్డిపల్లిలో శనివారం రాత్రి స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క అలియాస్ శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

